# స్త్రీ

సారధి అద్దంముందు నిలబడి అర గంటైనా అయింది. ముస్తాబులో మూడో వంతుకూడా ముగిసినట్టు లేదు. లక్స్ సబ్బుతో రెండుసార్లు రుద్దుకున్న మొహానికి పాండ్స్ స్నో మెత్తుకుని రెమీ పౌడరు అద్దుకున్నాడు. టేబుల్ మీద పెట్టుకున్న అద్దానికి దూరంగానూ దగ్గిరగానూ నడుస్తూ వివిధ కోణాల్లో కోటా సరిజూచుకున్నాడు. నున్నగా దువ్వుకున్న జుట్టుని మళ్ళీ దువ్వెన తిరగేసి నొక్కు నొక్కులుగా ఒత్తుకొని కొంత జుట్టు దుబ్బుని నుదురుమీదకి పడేసుకుని సంతృప్తిపడ్డాడు. షర్టు చేతులు మడతలు పెట్టుకుంటూ కంఠందగ్గిర గుండీ తీసి డెస్కులో పడేశాడు. గాబర్డీన్ పాంటులోకి టెర్లిన్ షర్టు టక్‌చేసి మచ్చ మచ్చల నైలాను బెల్టు తగిలించాడు. సిల్కు కర్చీఫ్ మీద నూర్జహాన్ సెంటు వొంపుకుని, పాలిష్ చేసుకున్న బాటా బూట్లు కట్టుకున్నాడు. రేడియో కవర్ మీద బుద్ధిగా యెదురు చూస్తోన్న రిస్టువాచీ అందుకుంటూ గాజుల చప్పుడికి గుమ్మంకేసి చూశాడు.

నవ్వుతూ కన్పించింది విజయ — "ఒక గంట నుంచి ఇక్కడే నించున్నాను."

"ఎంత పిచ్చిదానివి! కూర్చోవాలనైనా తెలీలేదూ?'

"రాజావారు షోకీళా పురుషులై పోతున్నారు. గంటల కొద్దీ అంతూ దరీ లేని ముస్తాబు! కొంచెం కాటుకకూడా అంటించుకుంటే బాగుంటుంది."

"థాంక్స్ డార్లింగ్! బాగా గుర్తు చేశావు. ఇవ్వాళే ఓ సుర్మాబాక్స్ కొంటాను" అంటూ మళ్ళీ అద్దంలోకి చూపులు మళ్ళించాడు.

విజయ ఇంకో సలహా ఇచ్చింది.

"ఇక మనం నిలువుటద్దం కొనాల్సిందే! ఈ చిన్న అద్దంలో మీ అందం పట్టటం లేదు."

"పర్వాలేదు డియర్! ఎలాగో ఇబ్బంది పడతాను. నీ కేం కష్టంగా లేదుగా? నీకు అద్దం సరిపోతోందిగా?"

చిరునవ్వులోనే కోపం ప్రదర్శించింది విజయ. "అక్కడికి మీరే నవ మన్మధుడైనట్టు .... ఇంతకీ ఎక్కడికి ప్రయాణం?"

"అంత నిలదీసి అడుగుతున్నావు, మరి చెప్తే బాధపడవుగదా?"

"ఏం, అంత బాధపడే చోటుకి బయల్దేరుతున్నారా?"

"ఏమో! ఆడవాళ్ళకు అసూయ వుంటుందిగా?"

"అవును, నాకు అసూయ అని మీకు తెలిసిందిగా? బాధపడతానని తెలిస్తే మానుకుంటారా అక్కడికి వెళ్ళడం?"

"నో, నో, అదేం కుదరదు. వెళ్ళి తీరాలి."

"అందుకే చెప్పి మరీ వెళ్ళండి."

"అయితే చెప్పేస్తున్నాను. తర్వాత నన్నేం అనొద్దు. నువ్వేం అనుకోవద్దు."

"ఈ ఉపోద్ఘాతాలకేంగాని సంగతేమిటో చెప్తురూ!"

"ఓ పిల్ల నన్ను పిలుస్తోంది రోజూ. అందుకని ఇవ్వాళ తెగించి ...."

చురుగ్గా చూసింది విజయ. అంతలోనే నవ్వుతూ అంది. "పిల్ల పేరు మల్లిమొగ్గా, మీ పేరు జమీందారునా?"

"నిలదీసి అడిగావు. నిజాయితీగా చెప్పేశాను. తర్వాత నీ ఇష్టం."

"పిల్ల దగ్గిరికి వెళ్ళేదైతే బైటికి చెప్పుకుంటారా ఎవరైనా?"

"ఎవరి సంగతో నా కెందుకూ? నేను మాత్రం ఏం చేసినా దాచుకోకుండా చెప్పేస్తాను. నువ్వు చాలా మంచిదానివి కాబట్టి."

"నేనేం అలాంటి మంచిదాన్ని కాదు, ఆ వెధవ మంచితనం నాకు అక్కర్లేదు."

"అబ్బే! అలాగంటే ఎలా? నువ్వు ఒప్పుకోవుగానీ నువ్వు చాలా మంచిదానివి."

"పొగిడితే నేనేం పొంగిపోను. హాస్యాలకి కూడా అర్థం పర్థం వుండాలి."

"హాస్యమా? నీతోనా? పొరపడుతున్నావు డియర్! ఇది పచ్చి నిజం. నమ్మకపోతే నేనేం చెయ్యను?"

విజయ కాస్సేపు దీర్ఘంగా చూస్తూ నించుంది. "ఎక్కడుంది ఆ పిల్ల?" అంది.

"ఆకాశపు అంచునా .... చందమామ చాటునా .... నక్కివున్నా నోయ్ బావా, దాగి వున్నానోయ్ అని పాడుతూంటుంది రోజూ."

"అయితే భూమ్మీద లేదన్నమాట!"

"మా ప్రేమని అర్థం చేసుకోలేకపోతున్నావు విజ్జీ! ఊహలోకాల్లో తేలియాడే నా చిన్నారి లవ్వు — అంటే ప్రేయసి— గోదా వరిగట్టున పర్ణశాలలో కూనిరాగాలు తీసుకుంటూ తన్మయంచెందే ఓ జాలరి చిన్నది ఆహా! ఎంత సుందరంగా వుంటుందనుకున్నావ్? బెదిరి బెదిరి చూసే లేడికళ్ళూ — పెదవుల్లో దాగివున్న దొండ పళ్ళూ — తుమ్మెదల్ని బంధించిన జుట్టుముళ్ళూ ...."

"నీచు నీచుగా కంపువొళ్ళూ ...."

"నో, నో — అదెంత గుడ్ స్మెల్! చేప పిల్లల్ని దేవుకునే ఆ చేతి వేళ్ళతో గంటల తరబడీ ఆడు కోగలను. ఊర్వశిగాని నా ప్రేయసిని చూసిందంటే ఉసూరుమనుకుంటూ వెనక్కిపోదూ?"

"ఏమిటి పిచ్చిధోరణి? ఇక కట్టి పెట్టండి! ఇలాంటి మోటు హాస్యాలతో నన్ను బాధపెట్టొద్దు. నాకు చాలా అసహ్యం."

"పూర్ ఫెలోవి! తప్పదు డార్లింగ్, తప్పదు. ఇదిగో! నేను వెళ్తున్నాను. రాత్రికి రాకపోవచ్చు."

"మళ్ళీ ఆ ముక్కనండి! కాళ్ళు విరగ్గొట్టి మూల కూర్చోబెడతాను."

"ఛ, ఛ! పతివ్రతలు భర్తల కాళ్ళు విరగ్గొడతారా?"

"ముందు విరగ్గొట్టి, తర్వాత బాగు చేయిస్తారు. అదే ఈ కాలం పాతివ్రత్యం!"

"కాళ్ళు వచ్చాక మళ్ళీ బుద్ధిపోతే?"

"మళ్ళీ విరగ్గొట్టి, ఈసారి "బాగుచేయించను."

"అమ్మో! మాటల్లో పడి కూర్చున్నాను. నా చిన్నది ఎదురుతెన్నులు చూస్తూ వుంటుంది. వస్తా! .... కాదులే, ఇవ్వాళ రాను .... వొచ్చేస్తున్నా ప్రేయసీ! వచ్చే స్తున్నా!" ఈలవేసుకుంటూ పోతోన్న సారథిని చూస్తూ విజయ "ఛీ, ఏమిటీ మనిషి! రోజుకో మేళం! ఎన్నిసార్లు చెప్పినా పాడు హాస్యాలు!" అనుకుంటూ నించుంది.

అలాంటి సరసాలు విజయకి నచ్చవు. "ఎవరికి మాత్రం నచ్చుతాయి బాబూ!" అనుకుంటుంది.

అలా అనుకున్నప్పుడల్లా చటుక్కున రుక్మిణత్త గుర్తుకొస్తుంది.

రుక్మిణత్త మనిషి కాదా? మనిషికి వుండే బాధ అత్తకి వుండేది కాదా? — అనిపిస్తుంది.

అత్త గుర్తు వచ్చినప్పుడల్లా మనసు ఆలోచనలతో కొట్టుకుంటుంది. రకరకాల ప్రశ్నలు చెలరేగుతాయి.

"పాపం, పిచ్చి అత్త!" అని జాలిపడాలన్పిస్తుంది ఒక్కోసారి. "ఛా! బొత్తిగా తెలివిమాలింది" అని విసు క్కోబుద్ధి పుడుతుంది, ఒక్కోసారి.

"పతివ్రత నైపోదామనే తాపత్రయమో ఏమిటో!" అని కోపం వొస్తుంది చాలా సార్లు.

విజయలాంటి ఆడపిల్లకి రుక్మిణత్త అర్థమేకాదు.

★ ★ ★

ఆ పల్లెటూళ్ళో, రుక్మిణత్త, చిన్నపిల్ల లందరికీ అత్తయ్యే! మధ్యాన్నం పూట వాళ్ళ మండువాలో జేరి ఆటలాడుకోటం, రుక్కు అత్తతో జడలు వేయించు కోటం, ఆ వీధి పిల్లలందరికీ అలవాటు.

పిల్లలందరికీ రుక్మిణత్త శనక్కాయలో, వేపుడు శెనగలో, కారం అటుకులో పెడ్తూ వుంటుంది చాలా సార్లు.

రుక్మిణికి పిల్లలు లేరు. అందుకే పిల్లలందర్నీ అంత ముద్దుచేసి వాళ్ళ అల్లరి చూసి నవ్వుతూ వుంటుంది. ఆ పిల్లల ముఠాలో విజయే కాస్త పెద్దది. పది పన్నెండేళ్ళది. రుక్మిణికి విజయంటే మరీ అభి మానం. కాస్త దూరం చుట్టరికం కూడానూ. విజయ ఒక్కోసారి రాత్రుళ్ళు కూడా అత్త దగ్గిరే వుండిపోతుంది.

ఒక రోజు .... మిట్ట మధ్యాన్నం అత్తయ్యగారి మండువాలో జేరారు పిల్లలంతా. విజయా సావిత్రీ సరోజా కమలా పచ్చీసు ఆడుకుంటున్నారు. వరలక్ష్మీ సుశీలా చింతగింజలు లెక్కపెట్టుకుంటున్నారు. సావిత్రి చెల్లెలూ, కమల పెద్ద తమ్ముడూ కాయితాలు చింపుకుని గాలి పటాలు కట్టుకుంటున్నారు. చావి డంతా గోలగోలగా వుంది.

వెంకట్రాయుడు మామయ్య వీధిలోంచి

వచ్చాడు. మామయ్య వెనకాల ఎవరో ఆడమనిషి కూడా వచ్చింది. ఎర్రగళ్ళ చీర సీలమండల పైకి కట్టు కుంది. కాళ్ళ కడియాలు బాగా కన్పడుతున్నాయి. రెండు చేతులకూ బెత్తెడేసి వెడల్పున ముదురు నీలం గాజులున్నాయి. జుట్టంతా గట్టిగా బిగించి కొప్పు పెట్టుకుంది, కుడి చెంప మీద. నల్లగా జిడ్డుగా వున్న మొహంలో డబ్బంత ఎర్రబొట్టు మసగ్గా కన్పిస్తోంది. మామయ్య వెనకే నెమ్మదిగా నడుచుకుంటూ వచ్చింది చావిట్లోకి. పిల్లలెవరూ దాన్ని పట్టించుకోలేదు. పొలం పనివాళ్ళు కూలికొస్తే, మామయ్య ధాన్యం కొలి పించటం అందరికీ తెలిసిందే.

వెంకట్రాయుడు దక్షిణం గది తలుపులు తోసు కుని లోపలికి వెళ్ళాడు. వెనకే ఆ కూలిమనిషీ కూడా గదిలోకి వెళ్ళబోయింది.

ఆటల సందట్లో మునిగి పోయిన విజయ హఠా త్తుగా తలెత్తి చూసి అరిచింది — "ఏయ్! లోపలి కెల్తావేం? నించో ఇక్కడ. మామయ్య తాళాలు తీసు కొస్తాడు. ధాన్యం గది వాకిట్లోనే వుంది."

బిత్తరపోతూ గడపకివతలే నించుండి పోయిందా ఎర్రచీర మనిషి. వెంకట్రాయుడు దాని చెయ్యి పట్టి గుంజి లాగాడు గదిలోకి. అది తలుపుచాటుకి ఒదిగి నించుంది. దాని బొమ్మ కొంచెం తెరుచుకున్న తలుపు లోంచి, ఎదరగోడకి వేళ్ళాడుతోన్న అద్దంలో స్పష్టంగా కన్పిస్తూంది చావిట్లోకి. పిల్లలంతా గోలచేసుకుంటూ గదిలో దూరిన కూలిదాన్నీ, అద్దంలో పడుతోన్న దాని బొమ్మనీ, చూడ్డానికి గుమ్మందగ్గిర గుంపుగా చేరారు.

రాయుడు కోపంగా "ఏయ్, పోండి! ఇళ్ళకు పోండి! ఊఁ, చెప్తోంటే కదలరేం? మళ్ళీ సాయంత్రం వచ్చి ఆడుకుందురు గాని నడవండి" అంటూ పెద్ద గొంతుతో కేకలేస్తూ పిల్లలందర్నీ చావిట్లో లేకండా చెదరగొట్టేశాడు. ఉండేలు చూసిన కాకుల్లా చెల్లాచెదరై వీధిలోకి పరుగెత్తారు పిల్లలు.

విజయ ఒక్కతీ పడమటింటి గదిలో నక్కింది. వెంకట్రాయుడు మళ్ళీ దక్షిణం గదిలో దూరి తలు పులు బిగించుకున్నాడు, ఆ ఎర్రచీర కూలి మనిషి కూడా గదిలో వుండగా.

విజయ పరికిణీ ఎగరేసుకుంటూ వంటపాకలోకి పరుగెత్తింది. "అత్తా! అత్తా! మామయ్యేమో .... ఎవతో కూడా గదిలో కెళ్ళింది .... తలుపులన్నీ వేసేశాడు."

"ఎప్పుడే?" రుక్మిణి నవ్వుతూ అడిగింది.

"ఇప్పుడే. మేమంతా ఆడుకొంటూంటే వెళ్ళి పొమ్మని కేకలేశాడు. నే నొక్కదాన్నీ నీ దగ్గిరకి పరు గెత్తుకొచ్చేశాను. రా అత్తా! చూద్దాం రా!"

కందిపచ్చడి రుబ్బుతోన్న రుక్మిణి విరగబడి నవ్వింది — "పిచ్చిపిల్లా! అటు వెళ్ళకు. కూర్చో నా దగ్గర. ఆ పీటతెచ్చుకో, పచ్చడిలో ఉప్పుచాలిందో లేదో చూడు!" అంటూ గోరెడు పచ్చడి విజయ చేతిలో పడేసింది.

పీటమీద కూర్చుని పచ్చడి చప్పరిస్తూ కుతూహ లంగా అడిగింది విజయ — "అది ఎవరత్తా?"

"ఎవతో పొలంపనికి వొచ్చిందేమో! మీ మావ య్యకి మనసైంది కావున్ను! అందంగా వుందా?"

"ఛీ! దెయ్యంలా గుంది."

ఫక్కుమంటూ నవ్వింది రుక్మిణి.

"నీకు నచ్చలేదంటే? మీ మావయ్య కళ్ళకి రంభ లాగా ఉంటుందే అది! పోనీ నీకు నేను బాగుం టానా?"

విజయ అత్తకేసి అభిమానంగా చూసింది. ఆ చూపే అత్త తనకి బాగా నచ్చినట్టు చెప్తోంది. నిజంగానే రుక్మిణి అందంగా ఉంటుంది. పచ్చగా బొద్దుగా ఏ చీర కట్టుకున్నా నిండుగా ఉంటుంది. ఎంత అణచి దువ్వుకున్నా రేగుతూ వుండే చిర్ర జుట్టుని అందంగా మెడ మీదికి బర్మాముడి చుట్టుకుంటుంది. ఏ రోజూ కాళ్ళకి పసుపూ, కళ్ళకి కాటుకా, మొహాన బొట్టూ బద్ధకించకుండా పెట్టుకుంటుంది. పిల్లా జెల్లా లేరేమో, ఎప్పుడూ ఎడ్డిగా మడ్డిగా కన్పించక, పరి శుభ్రంగా కడిగిన ముత్యంలాగా ఉంటుంది.

రాయుడికి పెళ్ళామంటే మోజు లేదు. పెళ్ళాం ఏ విధంగా అలంకరించుకున్నా, ఎంత కొత్తచీర కట్టు కున్నా, ఆ సింగారంలో అతనికి ప్రత్యేకతేమీ కన్పిం చదు. దగ్గరికి రావాలన్న తహ తహేమీ ఉండదు.

వెంకట్రాయుడు బాగా పొడగరి. బలిష్ఠమైన వాడూ. మల్లు పంచె కట్టి, గ్లాస్కో లాల్చీ తొడిగి, జరీ కండువా వేసుకుని బయల్దేరుతోంటే రుక్మిణి ముచ్చ టగా చూసుకొంటుంది.

ఈడూ జోడూ విషయంలో రుక్మిణి వెంకట్రా

యుడికి ఏమంత సరిపడదనే అందరూ అంటారు. రుక్మిణి పొట్టి, వెంకట్రాయుడి దగ్గిర నిలబడితే అసలే పొట్టి.

"పొట్టి పిచ్చుకలాగ నువ్వు నా గుండెల దగ్గిరకైనా రాలేదే!" అంటూ హాస్యాలాడుతూనే వుంటాడు రాయుడు.

"పోనిద్దురూ! మీ ముచ్చటలకు నేనేం అడ్డు రావటం లేదుగా? నా ఖర్మనాదీ" అని నవ్వేస్తూం టుంది రుక్మిణి.

"విజ్జీ! ఏవిటే మాట్లాడకుండా కూర్చున్నావ్? నేనెలా ఉంటానని అడిగితే చెప్పలేదేం?" అంది అత్త.

విజయ ప్రేమగా అంది — "నువ్వు చక్కగా ఉంటావత్తా!"

"ఛ! పొట్టిదాన్ని. అందంగా ఉండ నటకదూ? చూడు. మీ అమ్మా వాళ్ళు పొడుగ్గా నిండుగా ఉంటారు."

"ఎందుకేమిటి అంత పొడుగు? నువ్వే బాగుం టావ్ నాకు."

పచ్చడి రుబ్బుతోన్న అత్తకేసి చూస్తూ కూర్చుంది విజయ. "అత్తా! అది నీ గదిలో కూర్చుంది కదా, దెబ్బలాడవేం?"

"ఛ! దెబ్బలాడకూడదే! అదే వెళ్ళిపోతుంది."

విజయకేం నచ్చలేదు. ఇంకేం అడగ లేదు. అడిగినా అత్త సరిగ్గా చెప్పటం లేదు. కాస్సేపు బుద్ధి గానే కూర్చుంది. హఠాత్తుగా అంది — "అది వెళ్ళిపోయిందేమో చూసిరానా?"

"దాని గోలెందుకే నీకు? కూర్చో, అన్నం పెడతాను. తినేసి వెళ్దువుగాని ఇంటికి."

పచ్చడిలో చిట్ట చివరో వెల్లుల్లి గడ్డ చితిపి పడేసి జాడీలోకి తీసుకుని లేచింది రుక్మిణి. ఆ చేత్తోనే విజయకి అన్నం పెట్టి కమ్మగా నెయ్యివేసి కంది పచ్చడి ముద్దలు కలుపుతూ కూర్చుంది.

పెరటి వేపుకు వచ్చాడు వెంకట్రాయుడు. "ఉడుకు నీళ్ళున్నాయేమో తోడి పడెయ్యే!" అన్నాడు.

"విజయ ఎంత గొడవ చేసిందో చూశారా?" అంటూ నవ్వుతూ లేచింది రుక్మిణి. పొంత కుండెడు నీళ్ళు చేదలోకి దిమ్మరించి వేపచెట్టుకింద పెట్టి వచ్చింది. తుండుగుడ్డ తీసుకెళ్ళి కొమ్మమీద వేళ్ళాడేసింది.

నీళ్ళు దిమ్మరించుకుంటున్న మొగుడికి ఎదు రుగా నిలబడి హాస్యంగా అంది. "పొలం పనికి కొత్త ఆడది రావటం పాప మనుకుంటాను."

"అఘోరించావ్‌గానీ అన్నం వడ్డించు, వచ్చేస్తు న్నాను."

రుక్మిణి విజయ పక్కనే పెద్ద పీటవాల్చి వెండి కంచంలో అన్నం కూరలూ వడ్డించింది.

రాయుడు ఒళ్ళు తుడుచుకుని పీట మీద కూర్చుంటూ విజయ వీపు మీదో చరుపు చరిచాడు — "మీ అత్తకేం కోపం లేదుగానీ నీకు కోపం వచ్చిందంటే పిల్లా?"

సిగ్గుపడి తల దించేసుకుంది విజయ.

"ఇది మొగుణ్ణి బాగా సాధించేలాగే వుంది. అతన్ని ఎటూ కదలనివ్వదనుకుంటా" అంటూ నవ్వింది రుక్మిణి.

అత్త ఎందుకు నవ్వుతోందో విజయకి అర్థమే కాలేదు.

**ఇం**కో సారి మధ్యాన్నం రెండు గంటల వేళ!

"అత్తా! గాజులమ్మాయి వీధిలో పోతోంది. పిలవనా? గాజులు వేయించుకోవాలన్నావుగా నిన్న?" అంటూ హడా విడిగా వచ్చిపడింది విజయ.

"అవునే విజ్జీ. చేతులు నిండుకున్నాయ్. పిల్చుకు రాలేకపోయావా? అది వెళ్ళిపోతుందో యేమో!" అంటూ రుక్మిణి నిద్రమత్తులోంచి లేచి చావిట్లోకి వచ్చింది. అప్పటికే బైటికి పరుగెత్తింది విజయ. కాస్సే పటికి గాజుల కనకాన్ని వెంటబెట్టుకుని వచ్చింది.

కనకం, ఆ మధ్యనే కొత్తగా వస్తోందీ వూళ్ళ వెంట. కనకం, గోనె సంచులతో గాజులమ్ముకునే మలారం మనిషిలా ఉండదు. అద్దాల పెట్లోంచి గాజులు పైకి కన్పించేలాగ గాజుల్ని రంగు రంగులుగా పేర్చి పెట్టిని చేత్తో పట్టుకుంటుంది కనకం. దాని దగ్గిర గాజులు కొనుక్కోటం చాలా మంది ఆడ పిల్లలకు సరదా.

ఆ రోజు కనకం జిలుగు జిలుగుల్లా పెనవేసు కున్న తీగల చీర కట్టుకుంది. చీర కుచ్చెళ్ళు రోడ్డుని తుడిచేలా నేలమీద పొరాడుతున్నాయి. చెంపలు ఎగ దువ్వుకుని నడినెత్తిమీద వంకీముడి చుట్టింది. అస్త

మానూ తమలపాకులు నములుతూ ఉంటుందేమో పళ్ళూ, పెదాలూ గారపట్టి పుగాకు రంగుతో కన్పిస్తు న్నాయి. చెంపల మీద పౌడర్ చెమటకి తడిసి మచ్చలు కట్టింది. చావిట్లోకి వస్తూనే చెమ్కీచారల చెప్పులు గుమ్మం వారగా విడిచింది.

రుక్మిణి అంత వరకూ కనకం దగ్గిర గాజులు కొనుక్కోలేదు. ఒకసారి దాని కేసి ఆశ్చర్యంగా చూసి ఈతాకుల చాప తెచ్చి పరిచింది.

కనకం చిన్నగా నవ్వుతూ చావిడంతా ఒకసారి కళ్ళు తిప్పి చూసి చాపమీద కూర్చుని, పెట్టి తెరిచింది. అంతలోనే మొహం తుడుచుకునే చేతి గుడ్డతో గాలి విసురుకోవటం మొదలు పెట్టింది.

రుక్మిణి కొంచెం జాలిపడ్డట్టు చూసి, "ఎండ లోంచి వస్తే మరీ ఉడకబోతగా ఉన్నట్టుంది. విజయా, కాస్త లోపలికి వెళ్ళి విసన కర్ర తీసుకు రావే" అని విజయకి పురమాయించింది.

కనకం కేసి కన్నార్పకుండా చూస్తూ కూర్చున్న విజయ బలవంతంగా లేచింది. కనకాన్ని చూసినకొద్దీ చూడాలనిపిస్తుంది పిల్లలందరికీ. పెళ్ళి పందిట్లో గ్యాసులైట్ల వెలుగులో డాన్స్‌చేసే ఆడవాళ్ళలాగే వుంది కనకం. అలాగే అస్తమానూ ఉత్తపుణ్యానికి నవ్వుతూ ఉంది.

ఒక్క నిమిషంలో చాటంత విసనకర్ర తీసుకుని పరుగెత్తుకు వచ్చింది విజయ.

"కొంచెం మజ్జిగ తాగుతావూ? నీ పేరు కనకం కావును, విన్నాలే" అంది రుక్మిణి దాని చెమటలు చూడలేక.

కనకం ఇబ్బందిగా మొహం చిట్లించింది — "చల్ల .... వద్దుబాబూ, కాసిన్ని టీ నీళ్ళిస్తే తాగుతాను" అని నవ్వింది.

"టీలూ కాఫీలూ మా ఇంట్లో వుండవు మరి. పోనీ పాలు కావాలంటే తాగు" అంది రుక్మిణి. "దాలి మీద కుండలో వున్నాయి, కాసిన్ని గాజు గ్లాసులోకి ఒంపుకు రావే విజ్జీ! జాగర్త! కుండ బద్దలు కొట్టేవు" అని విజయకి చెప్పింది.

పాలు తాగి విసనకర్రతో కాస్సేపు విసురుకుని గాజులు చూపించటం మొదలుపెట్టింది కనకం.

మధ్యాన్నం నిద్ర ముగించిలేచి గదిలోంచి బైటికి రాబోయిన వెంకట్రాయుడు గుమ్మం దగ్గిరే ఆగి పోయాడు — ఎదరగా కన్పిస్తున్న చెమ్కీ చెప్పులకేసి చూస్తూ.

"ఈ గాజులు తీసుకోండమ్మా! అర్ధాంగి గాజులు. పెళ్ళాం వేసుకుంటే చాలు మొగుడు బంద్ అయి పోయినట్టే! కుక్కలా వెంటపడతాడు ...." అని తన చమత్కారానికి తనే గట్టిగా నవ్వుతోంది కనకం. పెడ కాళ్ళు వేసుకుని ఒయ్యారంగా కూర్చుని గాజులు విప్పి చూపిస్తోంది.

"తీసుకుంటాలే, ఇంకా రకాలు చూపించు" అంది రుక్మిణి.

"ఇవి చాలా బాగున్నాయత్తా. గమ్మున తీసుకో" అంటూ కంగారు పెట్టింది విజయ.

వెంకట్రాయుడు ఆరాటంగా గాజుల కనకంకేసి చూస్తూ నించున్నాడు. కాసేపటికి లోపలికి వెళ్ళిపోయి "జయా! మీ అత్తనిలా రమ్మను" అని కేక లెట్టాడు రెండు మూడు సార్లు.

గాజుల ఎన్నిక ఆపుజేసి వెళ్ళింది రుక్మిణి. కాస్సే పటికి మామూలుగా చావిట్లోకి వచ్చింది.

వెంకట్రాయుడు కనకం కేసి కోరగా చూస్తూ ఠీవిగా నడుస్తూ వీధిలోకి వెళ్ళిపోయాడు.

కనకం ఒకటి రెండుసార్లు వీధికేసి చూసి మళ్ళీ గాజుల బేరంలో పడింది.

"నా గాజులు తరవాత తీసుకుంటాగానీ ముందీ పిల్లకి అందమైన గాజులు వెయ్యి" అంటూ విజయ చేతులు అందించింది రుక్మిణి.

"నేను మొన్నే వేయించుకున్నా నత్తా!" అంటున్నా విన్పించుకోకుండా కొత్తగా నాలుగేసి తళుకు గాజులు వేయించింది విజయకి.

"మీ గాజులు కూడా గమ్మున చూసుకోండమ్మా! నేను పోవాలి" అని కంగారు పడింది కనకం.

"పోనీ ఊళ్ళో అమ్ముకురా! తర్వాతే తీసు కుంటాలే నేను" తాపీగా కూర్చుంది రుక్మిణి.

"పొద్దుపోద్దమ్మా, ఏకంగా అమ్ముకుని పోతాను. చీకట్లో స్టేషన్‌కాడికి నడచిపోవాలి."

"అంత చీకటి పడితే మా ఇంట్లో వుండి పోదువు లెద్దూ! ఏం, మేం మాత్రం మనుషులం కామా? ఒక్కపూటకి ఆదరించలేమా?"

"అదేం మాటమ్మా? ఇంటికాడ మా యజమాని ఎదురు చూస్తూండడా?"

"చూస్తే చూస్తాళ్ళే. చీకటిపడి వెళ్ళలేనప్పుడేం చేస్తావు? ఈ పూట మా ఇంట్లో వుండాల్సిందే! పది రూపాయల గాజులదాకా తీసుకుంటాను. తీరికగా చూసుకోవాలా వద్దా?"

"అయితే ముందు ఊళ్ళో చూసుకు రమ్మంటారా?"

"ఆఁ, వెళ్ళిరా! మర్చిపోకు సుమా! నా చేతులసలే నిండుకున్నాయి."

"అయ్యో! ఇంత పెద్దబేరం పోగొట్టుకుంటానేంటండీ?" — మళ్ళీ గాజులన్నీ పెట్టెలో సర్దుకుని లేచింది కనకం.

"అత్తా! ఇప్పుడే తీసుకోకూడదూ!" అంది విజయ తెల్లబోతూ.

"తీరికగా తీసుకుందాం లేవే! తొందరే మొచ్చింది?"

రుక్మిణి వంటపాకలోకి వెళ్ళి ఒక తవ్వెడు మినప్పప్పు నీళ్ళలో పోసి వచ్చింది.

సాయంత్రం అరకోడిపిల్ల నొకదాన్ని కోయించింది. కాసిన్ని గారెలు వండింది. జీడిపప్పూ యాలకపొడీ వేసి సగ్గుబియ్యం పాయసం కాచింది.

కనకం వచ్చేటప్పటికి బాగా చీకటి పడింది. వస్తూనే ఉస్సురంటూ కూలబడింది.

"కాస్త స్నానం చెయ్యి, వేడి నీళ్ళున్నాయి" అంది రుక్మిణి.

"ఇప్పుడేం స్తానంలేమ్మా! కాస్త తిండి తిని పడుకుంటాను."

"నీళ్ళు పోసుకుంటే .... ఎండలో తిరిగావేమో సుఖంగా వుంటుంది ప్రాణం. పాలేరు తోడిపెట్టనే పెట్టాడు దొడ్లో. ఒళ్ళు తుడుపు గుడ్డా సబ్బు బిళ్ళా అక్కడే వున్నాయి. లేచి వెళ్ళు, నా చీర ఏదన్నా ఇస్తాలే."

కనకానికి బద్ధకం పోయింది. సబ్బుతో ఘుమఘుమలాడేలా ఒళ్ళు తోముకుని నీళ్ళు పోసుకుంది. రుక్మిణి అందించిన చాకింటి చీర కట్టుకుంది. నైట్ క్వీన్ గుత్తులు రెండు తెంపి జుట్టులో కుక్కుకుంది.

అదంతా చూస్తోంటే మహదాశ్చర్యంగా వుంది విజయకి — "అత్తా! కనకం ఇక్కడెందుకుండిపోయింది?" అంటూ గుస గుసలాడుతూ అడిగింది, రుక్మిణి వెనకే తిరుగుతూ.

"పాపం చీకటి పడిపోయింది గదా? వాళ్ళ ఊరు ఎలా పోతుంది? పోనీ ఈ రాత్రికి వుంటే మనదేం పోయింది? కాస్త అన్నం పెట్టలేమా?"

కోడిమాంసం, గారెలూ, పాయసం .... అపసోపాలు పడుతూ తింటోన్న కనకాన్ని చూస్తే విజయకి మళ్ళీ కొత్త ఆలోచన వచ్చింది! "అత్తా, కనకం మనకి చుట్టం కాదుగా? ఇవన్నీ ఎందుకు వండావు?"

"ఛ! దాని కోసం వండానా ఏంటి? మనం మాత్రం తినటం లేదూ? మీ మామయ్య వండమంటే వండాను."

మామయ్య పొలంనించి తొందరగా వచ్చాడు. హడావుడిగా పాలేళ్ళ మీద అరుస్తూ తిరిగే మామయ్య ఎందుకో నెమ్మదిగా మాట్లాడుతూ వాళ్ళని తొందరగా పంపేశాడు. పెరట్లోకీ చావిట్లోకీ అదే పనిగా తిరుగుతున్నాడు.

మామయ్య కనకం కేసి చూసి నవ్వుతోంటే, కనకం సిగ్గు పడిపోతున్న దానిలా తలుపుచాటుకి నక్కింది.

విజయ గబగబా రుక్మిణి దగ్గిరకి వెళ్ళి "అత్తా! గాజుల కనకం ఎక్కడ పడుకుంటుంది?" అని అడిగింది రహస్యంగా.

"లంకంత ఇంట్లో అది పడుకోటానికే చోటు లేదా? మనం ఈ వాకిట్లోనే పడుకుందాంలే. పద. వంటపాక తలుపులు వేసి వద్దాం."

విజయ కన్నార్పకుండా కనిపెట్టి చూస్తూనే వున్నా, కనకం వెంకట్రాయుడి దగ్గిరకి ఎప్పుడెళ్ళిపోయిందో అర్థమే కాలేదు!

అత్త దగ్గిరికి గుండెలు కవికేలా పరుగెత్తుకొచ్చింది విజయ — "అత్తా! చూశావా? కనకం మామయ్య దగ్గిర కూర్చుంది. .... దక్షిణం వేపు దొడ్లో. నవ్వుతూ మాట్లాడుతోంది."

"మీ మామయ్య బస్తీ కబుర్లేవో అడుగుతున్నారు కామాలే. అదే వస్తుందిలే. రా ఇలా, పడుకుందాం."

మొహం చిట్లించుకుంది విజయ — "ఛీ! అది మామయ్య దగ్గిర మంచంమీద కూర్చుంది తెలుసా? ఎంత .... దగ్గిరగా కూర్చుందనుకున్నావ్?" — ఎంత చెప్పినా అత్త గ్రహించలేక పోతోందని .... మామ య్యేదో చాలా తప్పుపని చేస్తున్నాడని, .... పాపం అత్తని వాళ్ళు మోసం చేస్తున్నారని .... విజయ బాధ! అత్తతో మాట్లాడుతూనే నిద్రపోయింది విజయ.

మర్నాటి పొద్దున్న కూడా కనకం చాలాసేపు గదిలోనే పడుకుంది. కొట్లోంచి కాఫీ పొడి తెప్పించి కాఫీ కాచి ఇస్తే తాగింది. పది గంటలకల్లా అన్నం తింది. నాలుగైదు రకాల గాజులు ఏరి ఇచ్చింది రుక్మిణికి. అదోలా నవ్వుకుంటూ తన చీర సంచీలో కుక్కుకుని రాత్రి కట్టుకున్న చీరతోటే బయల్దేరింది.

"నీ చీర అడగవేం అత్తా?" అని విజయ గుసగుస లాడింది.

"పోనీ లేవే. పేదదానికి ఒక చీర ఇస్తే ఏం పోతుంది?" అంది అత్త.

రుక్మిణి, కనకాన్ని నవ్వుతూ సాగనంపుతోంటే, తెల్లబోయి చూస్తూ నించుంది విజయ.

★ ★ ★

విజయకి చాలా జ్ఞానం తెలిసివచ్చింది పెద్ద మనిషై ఆకుల మీద కూర్చున్న పూట నించే. ఆ వారంరోజులూ అమ్మలక్కలంతా విజయ ముందే ఒకటే సరసాలాడుకున్నారు.

"ఏవమ్మోయ్! మంగమ్మొదినా! నీ కూతురు సమర్తాడి కూర్చుంది. ఇక ఆలస్యం చెయ్యకుండా అల్లుణ్ణి వెతకాలి. లేకపోతే నీ కూతురసలే నెరజాణ. ఎవణ్ణో లేవదీసుకు పోతుంది!" అని చెణుకు విసిరిందో పేరంటాలు.

విజయకి అక్క వరసయ్యే ఒక పడుచు పిల్ల "విజ్జీ! ఈ అత్త కొడుకునే లేవ దీసుకుపోవే!" అని ఫక్కుమంది.

ఆ వారం రోజుల్లోనే విజయకి, చాటుమాటుగా తిరగడాలూ, లేచిపోడాలూ, కడుపులు తెచ్చు కోడాలూ, పిల్లల్ని కని పారెయ్యడాలూ — అన్నీ అర్థమైపోయాయి.

పేరంటాళ్ళ కబుర్లలో రుక్మిణి సంగతులు కూడా దొర్లాయి.

"దానికేం సిగ్గులేదే! చీమూ నెత్తురూ వున్నాయా? ఎవతైనా మొగుణ్ణి చేతులారా ముండలకి అప్ప గిస్తుందా? .... నేనైతే మూడోనాటికి ఉరిపోసుకుని చచ్చేదాన్ని!"

"దాని మొహం! అదేం చెయ్యగలదు? ఆయన దాని మాట వింటాడా?"

"ఎబ్బే! దీనికే మొగుడంటే మోజు! మొదట్నించి ఇదే కొమ్ములిచ్చింది."

"అలాంటి కబురు వింటేనే ఒళ్ళు దహించుకు పోతుంది గదా? రుక్మిణి ఎలా భరిస్తుందో! దాని మంచితనం మెచ్చుకోవాలి!"

"ఛీ! అదేం మంచితనం, వల్లకాటి మంచితనం!"

అందరూ రుక్మిణిని తలోమాటా అంటోంటే, విజయకి అత్తమీద జాలేసింది.

విజయకి స్నానం అయిన్నాడు రుక్మిణి ఏవేవో ఫలహారాలవీ తీసుకొచ్చింది. "విజయ నాలుగు రోజులు మా ఇంట్లో భోంచేస్తుంది. పంపు వదినా!" అంది వాళ్ళమ్మతో.

మంగమ్మ తన అయిష్టం కన్పించనీయకుండా — "ఈడేరిన పిల్ల! ఇదివరకటిలాగ ఎందుకులే రుక్మిణీ, పొరుగిళ్ళ వెంట!" అని తప్పించుకోవాలనే చూసింది.

రుక్మిణి ఊరుకోలేదు — "నా కడుపున వొక్క ఆడపిల్లయినా పుడితే విజయలాగే పెద్దమనిషయ్యేది ఈపాటికి. ఆ భాగ్యం నాకు లేకపోయింది. విజయంటే నాకు పంచప్రాణాలు. నా చేత్తో దానికి నాలుగు రోజులు వండిపెట్టనీ! కాదనకు" అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

మరేమి అనలేక — "సరేలే వస్తుందిలే" అనే సింది మంగమ్మ.

విజయకి అత్తతో ఎన్నో విషయాలు మాట్లాడాలని వుంది. ఎన్నో అడిగి తెలుసుకోవాలని వుంది. ఎప్పుడూ తనింత పెద్ద దానిలాగా ఆలోచించలేదు.

★ ★ ★

విజయని భోజనానికి తీసికెళ్ళింది రుక్మిణి. అత్తని ఏదో అడగాలనుకుంటూనే రెండు రోజులు గడిపింది.

మూడోనాడు సాయంత్రం — కను చీకటి పడేవేళ .... చాకలి నారయ్య కొత్త కోడలు ఎంకి, బట్టలు తీసుకొచ్చింది. మూట విప్పి మడతలన్నీ దండెంమీద వేసింది. బుట్టలోంచి అన్నంగిన్నె తీసి గోడవారగా పెడుతూ — "ఈ పూట కాసింత వూరగాయి వూట పడెయ్యాలండోయ్ దొరసానమ్మ గోరూ!" అంది.

"వేవిళ్ళేమిటే నీకు?" అంటూ వంట పాకలోంచి బైటికి వచ్చింది రుక్మిణి.

"పోండమ్మా!" అని సిగ్గుపడుతూ చీడీల దగ్గిర కూర్చుంది ఎంకి.

చీకట్లో దాన్ని దగ్గరగా చూసిన విజయ "అత్తా! ఎంకి నీ చీరే కట్టుకుందే" అని అరిచింది.

రుక్మిణి నవ్వుతూ — "అదే నేనూ చూస్తున్నాలే. ఈ చీర నువ్వు కట్టుకుంటేనే చక్కగా వుందే" అంది ఎంకితో.

ఆ వెంకటగిరి సన్న జరీచీరతో ఎంకి బిర్రుగా గోచిపెట్టుకుంది. పమిటకొంగు వీపుమీద నుంచి తీసి బొడ్లో గుచ్చింది. వీపూ పొట్టా తొడలూ నల్లగా నిగనిగ లాడుతూ మెరుస్తున్నాయి. అంత మంచి చీర ఎంకి కట్టుకున్నందుకు రుక్మిణికి కోపం రాలేదు.

పొలం నుంచి వచ్చిన వెంకట్రాయుడు చీడీల మీదే నిలబడి ఎంకికేసి చూశాడు! రుక్మిణికేసి చూపులు మార్చాడు.

విజయ కేవిటో భయం వేసింది. అత్తకేసి చూడ బోయింది.

రుక్మిణి పాకలోకి వెళ్తూ "అన్నం వారుస్తున్నాను. తీసుకెళ్దువుగాని కాస్సేపు కూర్చోవే ఎంకమ్మా" అంది.

"రోజూ నువ్వే రారాదంటే గుడ్డ లివ్వటానికి" అన్నాడు రాయుడు మీసాల మీద చెయ్యి వేసుకుని నవ్వుతూ.

ఎంకి, చెంగున పడుతున్నట్టు తొడల్లో మొహం దాచుకుంది.

"నీ మొగుడు కన్పించటమే మానేశాడేమే? పెళ్ళాం వచ్చిందని మమ్మల్నందర్నీ మర్చిపోయాడా?" అంటూ వచ్చింది రుక్మిణి.

"లేదమ్మగోరూ! ఆడికి రేవుకాడే సరిపోతాది. సందేళకి ఉస్సురంటా కూకుంటాడు."

"మీ అత్తకి వొంట్లో బాగా లేదన్నారు, ఎలా గుంది?"

"అలాగే తినీ తినకా చత్తావుండి, బాధపడతా వుంది."

వెంకట్రాయుడు తుండుగుడ్డ కట్టుకుని నీళ్ళ కోసం కేక లెట్టాడు.

"ఒసేయ్ చాకలిపిల్లా! కాస్త ఆ ఉడుకు నీళ్ళకుండ దక్షిణం దొడ్లో పెట్టిరా!" అంది రుక్మిణి.

ఎంకి ఛెంగున లేచి కుండ భుజం మీదికి ఎత్తుకుంది.

విజయ గుండెలు కొట్టుకున్నాయి భయంతో.

ఎంకి పక్కదొడ్లోకి చలాకీగా నడిచిపోయింది.

రుక్మిణి, అన్నం వార్చు ఎత్తి ఎంకి గిన్నెనిండా అన్నంపెట్టి నాలుగు గరిటెల ఆవకాయ పచ్చడి వేసింది. ఒక వారగా పప్పుచారు పోసింది

దొడ్లోంచి ఎంకి కేకలు!

అదే ధ్యాసగా కూర్చున్న విజయ కంగారుగా లేచింది — "అత్తా! ఎంకి కేకలు పెడుతోంది. అరుస్తోంది!"

రుక్మిణి అటు పరిగెత్తింది. గబగబా వెనకాలే పడింది విజయ.

గది తలుపులు బార్లా తీసివున్నాయి. ఎంకి గోసి వూడి కాళ్ళ కడ్డంగా వేళ్ళాడుతోంది చీర. జుట్టుముడి లాగేసినట్టు మొహంనిండా వెంట్రుకలు కమ్ము కున్నాయి. చిన్న పిల్లలా నోరు పెద్దది చేసి ఏడుస్తూ — "గొప్పోళ్ళైతే గొప్పోరులా వుండాలిగాని ఇదేం పని? మానం మర్యాదాలేని మడుషులం అనుకున్నారేంటి? నా సత్తెం బావని తప్పితే మరో మొగోణ్ణి ఒంటిమీద చెయ్యెయ్యనిస్తానా?" అంటూ తిట్టుకుంటూ ఇవతలికి వచ్చేసింది. వేళ్ళాడుతోన్న చీర ఎగకట్టుకుంటూ వీధివేపు పోబోయింది.

"ఒసే ఎంకమ్మా! ఎందుకే అంత కోపం? ఒక్కసారి వెనక్కి రా! మాట!" అని అరిచింది రుక్మిణి.

"చాల్లే తల్లీ! నువ్వు చెప్పావని నీళ్ళకుండ తీసికెళ్ళి

దొడ్లో దించితే గమ్మున మీదబడి కావిటేసుకుంటాడా పెద్దమనిషి? గుడ్డంతా గుంజి పడేత్తాడా? అంత మద వెక్కిందేంటి వొంటికి?" అని దురుసుగానే అంది ఎంకమ్మ.

రుక్మిణి బతిమాలుకునే ధోరణిలో — "తప్పే లేవే! తప్పయిందే, నీ కడుపులో పెట్టుకో! అన్నం గిన్నైనా తీసికెళ్ళు! ఊరగాయ కావాలన్నావుగా?" అంటూ వెంట పడింది.

"ఒద్దులే తల్లే. మా మావొచ్చి తీసుకొత్తాడు, అడికే చెప్తాను" అంటూ ఎంకమ్మ చాలా కోపంగా చీడీలు దిగి వెళ్ళిపోయింది.

రుక్మిణి వెనక్కివస్తూ మొగుడి కేసి చురచురా చూసింది — "ఎన్ని సంవత్సరాలొచ్చినా ఆ మాత్రం ఇంగితం లేకపోతే ఎందుకూ? దాని కిష్టమో కాదో గ్రహించుకోవొద్దూ?" అని రుసరుస లాడింది.

వెంకట్రాయుడు కింది పెదవి మీదికెత్త లేదు.

విజయ కా ఇంటి పరిస్థితంతా జుగుప్సాకరంగా తోచింది. అత్తమీద అసహ్యం ముంచుకొచ్చింది.

పెద్ద చాకలి వచ్చి ఏం గొడవ చేస్తాదోనని బిక్కు బిక్కుమంటూ కూర్చున్న అత్తని చూస్తోంటే కొంచెం జాలికూడా వేసింది.

అర్ధరాత్రి దాటినా ఆ అన్నానికి ఎవరూ రాలేదు. మర్నాడు పొద్దున్నే చాకలి ముసిల్ది జ్వరంతో మూలుగుతూ వొచ్చి ఏ సంగతీ ఎత్తకుండా బట్టలు తీసుకు పోయింది.

★ ★ ★

"అత్తా! నిన్నోమాట అడగనా?" మధ్యాన్నం భోజ నాలయ్యి తీరిగ్గా కూర్చున్నప్పుడు అంది విజయ. ఎప్పట్నించో అనాలనుకున్న మాట అది.

"ఏమిటే అది?"

సిగ్గుపడుతూనే అంది విజయ. "మామయ్య మీద నీకు కోపంరాదా?"

"కోపమా? ఎందుకూ?"

"ఎందుకేంటత్తా? నీ కళ్ళ ముందే వేరే ఆడవాళ్ళతో తిరుగుతాడు. నీకు కోపంరాదూ అలాంటి తప్పు పనులు చేస్తే?"

"మగవాళ్ళకి తప్పేవిటి? ఎక్కడో రహస్యంగా, వాళ్ళ ఇళ్ళకెళ్ళి ప్రాణాల మీదకి తెచ్చుకునే కంటే .... నిక్షేపంలా మన ఇల్లూ వాకిలీ మనకి లేవూ?"

"మరి నీకు కోపం రాదూ?"

"ఎందుకూ? నాకు మాత్రం ఏం లోటూ?"

"అది కాదత్తా! అసలలా ఎందుకు తిరగాలి మామయ్య? ఆ ఆడవాళ్ళ మీదికి మనసెందుకు పోవాలి?"

"మొగాళ్ళకి అలాగే పోతాయి మనసులు."

"నీ మీద ఇష్టంలేదా మావయ్యకి? వేరే ఆడ వాళ్ళంటే ఇష్టమా?"

"పిచ్చిదానా! వాళ్ళ మీదేం ఇష్టమే! ఏదో అలాగ పోతారంతే. మావయ్యకి నేనంటేనే ఇష్టం. ఏ గుడ్డ కొనుక్కున్నా, ఏ వొస్తువు చేయించుకున్నా, ఎంతడిగితే అంత తీసుకోమంటారు. అసలు గాదిలో వొడ్లు నన్నే తీసుకుని అమ్ముకోమంటారు .... వాళ్ళకేమిస్తారే, అర్థో రూపాయో పడేస్తారు. అంతకన్నా ఏవిస్తారు? వాళ్ళ మీద ఇష్టవా వల్లకాడా?"

అత్త మాటలు విజయకేమీ నచ్చలేదు. ఇంకా ఎలా అడగాలో అర్థంకావటం లేదు. "అది కాదత్తా ...."

"నీ మొహంలేవే! మావయ్య నన్నడక్కుండా చేస్తాడనుకుంటున్నావా? మొగాళ్ళు మనకి తెలవకుండా చాటుగా మాటుగా పోయేకంటే, మనల్నడిగి పోతే మనకే మంచిదికదా?"

"ఛీ! అదేం మంచిదత్తా? నువ్వసలు మావయ్యతో ఎప్పుడన్నా పోట్లాడావా?"

రుక్మిణి కాస్సేపు నవ్వింది. "ఎందుకు పోట్లాడ లేదే తల్లీ! 'మీ కసలు కూలోళ్ళంటేనే ఇష్టంలెండి, వాళ్ళ మీదున్న మోజు నామీద లేదు' అని అలిగి పడుకునే దాన్ని. ఏడ్చేదాన్ని. మావయ్య ఏవనేవాడో తెలుసా? 'ఏడిశావు లేవే పిచ్చి మొహందానా! అళ్ళంటే ఇష్టమేటీ? నీ తర్వాతేనే అళ్ళూ. అళ్ళకీ నీకూ సాపత్యమేంటీ? నక్కకీ నాగలోకానికీ పోలికేంటీ?' అనేవాడు. ఆ మాట నిజమేనే విజ్జీ! ఈ మొగోళ్ళు అలా తిరుగుతారు గానీ, వాళ్ళకి ఆ తిరుగుబోతు ఆడోళ్ళంటే ఇష్టవనుకుంటున్నావా? అళ్ళకి ఒక్క పావలా డబ్బులు కూడా ఎక్కువివ్వరే!"

విజయకి చాలా బాధేసింది. అత్త చెప్పే సంగ

తులు ఎలా అర్థంచేసుకోవాలో అర్థం కాలేదు. "అది కాదత్తా! నువ్వసలు మావయ్యని ఏమీ అనవు. నేను చూస్తున్నానుగా? మా నాన్న ఇలా చేస్తున్నాడా? మా పెద్ద నాన్న ఇలా చేస్తున్నాడా చెప్పు?"

"ఎవళ్ళేం చేస్తున్నారో మనకేం తెలుస్తుందే? అయినా ఈయన మరీ మొండి మేళంలే. చెప్పీ చెప్పీ యాష్టకొచ్చి వూరుకున్నాను. ఏడ్చినా మొత్తుకున్నా వినకపోతే ఏం చేస్తాం చెప్పు?"

"నే న్నమ్మనత్తా! చిన్నప్పట్నుంచీ చూస్తున్నాను. మామయ్యకి ఎంతో మందిని నువ్వే అప్పగించావు. నీ చేత్తో వాళ్ళందరికీ వండిపెట్టావు. ముస్తాబులు చేశావు. నీ మనసులో కష్టం వుంటే అదంతా చేస్తావా?"

"ఏమోనమ్మా, కష్టాలూ నష్టాలూ అన్నీ చాలించు కున్నాను. ఆయనొచ్చి నన్నడిగితే, 'పోనీలెద్దూ' అని పిస్తుంది. ఇప్పుడసలు పట్టించుకోటమే మానేశాను."

"ఛీ! ఇదేం మనిషి?" అనిపించింది విజయకి అంతచిన్నప్పుడే.

"నువ్వలా ఒప్పుకోకూడదత్తా! పాపం ఆ ఆడ వాళ్ళని పిలిస్తే తప్పత్తా! మన ఆడవాళ్ళు అలా తిరుగు తున్నారా చెప్పు? వాళ్ళ నెందుకు పాడుచెయ్యడం? మనం కూడా ఆడవాళ్ళమే కదత్తా?"

"నీ పిచ్చిగానీ వాళ్ళని మనంపాడు చేసేదేవిటే? వాళ్ళసలు మంచివాళ్ళయితే మన మాట వింటా రేవిటే? ఎంకి చూడు, లొంగిందా? ఇష్టమైనోళ్ళే వస్తారు. వాళ్ళని బలవంతం చేస్తున్నాడా మావయ్య? పైగా, అర్థో రూపాయో పడేస్తారుగా?"

విజయ తెల్లబోయింది. 'అసలు ఏవిటీ మనిషి!' అనుకుంది మళ్ళీ. "వాళ్ళు మంచి వాళ్ళో చెడ్డవాళ్ళో మనకెందుకూ? చెడ్డ వాళ్ళయినా సరే, వాళ్ళని పిలవ కూడదత్తా! ఇంట్లోకి తీసుకొస్తే, నువ్వసలు వొప్పుకో కూడదు" అంది కోపంగా.

అత్త నవ్వులాటలో పెట్టింది — "అమ్మో, నువ్వు మొగుణ్ణి బాగా సాధించేలాగే వున్నావే! ఇలాగైతే నీ మాట వింటాడా అసలు? మొగోళ్ళని చూసీ చూడ నట్టు వొదిలెయ్యాలే!"

"ఛీ!" అని విజయ కోపంగా మొహం చిట్లిస్తే, అత్త మళ్ళీ నవ్వింది.

★ ★ ★

సం వత్సరాలు గడుస్తోన్నా వెంకట్రాయుడు మారలేదు, రుక్మిణీ మారలేదు.

విజయ అంతకన్నా మారలేదు. పుట్టింటికి వెళ్ళి నప్పుడు వాళ్ళింటికి వెళ్ళడమే మానేసింది.

వాళ్ళు ఎప్పుడు గుర్తొచ్చినా విజయకి అసహ్యంతో ఒళ్ళు జలదరిస్తుంది. ఆ మొగ పశువు సరే, ఆ ఆడ మనిషేవిటి! అదేం మనిషి! అది మనిషేనా అని! కట్టు కున్నా వాడు, తన కళ్ళముందు ఇంకో ఆడదానితో గదిలో దూరితే, తను పచ్చడి రుబ్బుతూనో, గారెలు వండుతూనో వంటపాకలో కాలక్షేపం చేస్తూ వుంటుంది! అదేం తలకాయో! అదేం శరీరమో!

వాళ్ళ సంగతి ఆలోచిస్తే విజయ నాలుగురోజుల దాకా మనిషి అవదు.

ఏ పేరంటంలోనోనన్నా కనపడితే రుక్మిణీ అడుగుతూ వుంటుంది, "ఏమే విజ్జీ, మా వేపు అసలు రావడమే మానేశావు?" అంటూ వుంటుంది.

విజయ నవ్వి వూరుకుంది రెండు మూడుసార్లు.

ఒక సారెప్పుడో రుక్మిణి మళ్ళీ పట్టుకుంది — "విజ్జీ! మా ఇంట్లో రెండ్రోజులు వుండరాదటే? మొన్న మీ మావయ్యకూడా అన్నారు, 'ఏంటీ, విజ్జీ అసలు కనపట్టవే లేదు" అన్నారు .... " అని నవ్వుతూ చెప్పింది.

విజయకి వొళ్ళు మండిందిగానీ, నవ్వుతూనే — "అమ్మో, మీ ఇంటికా? ఈసారి నన్నే తోస్తావు మీ ఆయన గదిలోకి" అంది.

రుక్మిణి కొంచెం చిన్నబుచ్చుకుంది. అయినా నవ్వు మొహంతో "నేను తోసేదేంటే, మావయ్య మీద మోజుపుడితే నువ్వే వెళ్తావేమో!" అంది.

అత్త చెంపమీద ఛెళ్ళున కొట్టాలన్నంత కోపం వచ్చింది విజయకి. "అవున్లే, లోకంలో ఆడవాళ్ళం దరూ నీ మొగుణ్ణి చూసి మూర్ఛలు పోతారనుకుంటా వులే అత్తా! మొగుడికి ముండల్ని అప్పజెప్పే నీకు అంతకన్నా ఏం తెలుస్తుందిలే!" అని చీత్కరించింది.

రుక్మిణి ఏడుపు మొహంపెట్టి —"ఎంత నాప సాని వయ్యావే!" అని సరసం వొలకబోసి ఇంటిదారి పట్టింది.

ఆ తర్వాత మళ్ళీ రుక్మిణిని చూడ లేదు విజయ.

"విజయ్! విజయ్!" అని గావుకేక లేసుకుంటూ వచ్చాడు సారథి.

గబగబా ఎదురు వెళ్ళింది విజయ. సారథికి వెనకే నించున్న రామాన్ని చూస్తూ విస్తుబోయింది — "ఇదేవిటి? నువ్వెప్పుడొచ్చావూ?"

"బావ స్టేషన్‌కి కూడా వచ్చాడు. నేను వస్తున్నానని నీకు తెలీదా?" ఆశ్చర్యంగా అన్నాడు రామం.

కోపంగా చూస్తోన్న విజయని చూస్తూ నవ్వాడు సారథి. "చూశావా, నా జాలరి ప్రేయసినీ, ఎంత బ్యూటిఫుల్‌గా వుందో!"

"చాలు, కట్టిపెట్టండి! కాళ్ళు విరక్కుండా తప్పించుకున్నారు."

ఇద్దరి సంభాషణా అర్థంకాక తెల్లబోయాడు రామం.

[1961 జూన్ "యువ" మాసపత్రికలో] ★

## ఈ కథ గురించి:

**నా** చిన్నప్పుడు, ఈ కథలో రుక్మిణిలాంటి ఆడవాళ్ళు నాకు తెలుసు. వాళ్ళు, భూములు బాగావున్న కుటుంబాల ఆడవాళ్ళు. మా కుటుంబానికి దగ్గిర బంధువులు. ఈ ఆడవాళ్ళు ఎలా వుండే వారంటే — తమ మొగుళ్ళు వేరే ఆడ వాళ్ళని తెచ్చుకుని, తమ గదుల్లోకి దూరుతోంటే, వీళ్ళు వంటింటి వేపు ఏవో పనులు చేసుకుంటూ నిమ్మకి నీరెత్తినట్టు వుండేవాళ్ళు. అత్తలో, అక్కలో వరసయ్యే ఆ ఆడవాళ్ళని నేను ఏమన్నా అడిగితే నవ్వులతో సరిపెట్టేసేవాళ్ళు.

వాళ్ళ భర్తలు, ఎంత మంది ఆడవాళ్ళతో తిరుగుతున్నా, ఆ మొగాళ్ళకి, ఆ ఆడవాళ్ళమీద 'ప్రేమలూ, వల్లకాడూ' ఏమీ వుండవట! ఊరికే అలా తిరుగుతారట! (ఇది పూర్తిగా నిజమే) ఆ భర్తల 'ప్రేమ' అంతా కట్టుకున్న భార్యల మీదే వుంటుందట! (ఇది పచ్చి అబద్ధం!)

ఆ భర్తలు, తమకు భార్యలమీదే ప్రేమ వున్నట్టు చెప్పేదంతా పూర్తిగా నాటకం అని ఈ భార్యలకు నిజంగానే తెలీదా, లేకపోతే తెలిసినా అదంతా నిజమేనని వాళ్ళని వాళ్ళే మోసం చేసుకుంటారా? — చిన్నప్పటి రోజుల్లో నా సందేహాలు అంత వరకే వుండేవి.

కానీ, క్రమంగా ఇంకో అనుమానం కూడా బైల్దేరింది. భూములూ సిరి సంపదలూ వున్న కుటుంబాల ఆడవాళ్ళకి, పేద సాదలంటే చాలా చిన్నచూపు. అందులోనూ పేద ఆడవాళ్ళంటే మరీ నిర్లక్ష్యం. పేద ఆడవాళ్ళకి నీతి నియమాలుండవని, ధనిక కుటుంబాల మొగవాళ్ళలాగే, ఆ కుటుంబాల ఆడవాళ్ళు కూడా నమ్ముతారు.

డబ్బు మదంతో తలలు పుచ్చిన ఆ ఆడవాళ్ళ అభిప్రాయాలు ఎలా వుంటాయంటే — (1) మొగాళ్ళు ఏం చేసినా, ఎవరితో తిరిగినా, తప్పులేదు. (2) పేద ఆడవాళ్ళు ఎలాగూ నీతివంతులు కారు. (3) అలాంటి ఆడవాళ్ళు మన మొగాళ్ళకి దొరికితే, వాళ్ళని వొదులుకోడం ఎందుకూ? ఇవీ వాళ్ళ అభిప్రాయాలు!

పేద వాళ్ళతో ఇతర చాకిరీలన్నీ చేయించుకున్నట్టే, ఆ ఆడవాళ్ళతో తమ మొగవాళ్ళు ఈ చాకిరీ కూడా చేయించుకోవచ్చు కదా? అలాంటి ఆడవాళ్ళని ఊరికే పోనివ్వడం ఎందుకూ? వాళ్ళని మన మొగవాళ్ళు వాడుకోవచ్చు కదా? — రుక్మిణిలాంటి ఆడవాళ్ళు, ఇలాగే ఆలోచిస్తారు. వాళ్ళు అలాగే చెప్పేవాళ్ళు.

ఇదే నిజం కాకపోతే, ఈ ఆడవాళ్ళు, వాళ్ళ మొగాళ్ళు చేసే తప్పుడు పనులన్నీ చూస్తూ నిమ్మకు నీరెత్తినట్టు వుండడం ఎలా సాధ్యం? ఈ ఆడవాళ్ళు, తమ మొగాళ్ళని పోట్లాటలతో అదుపులో పెట్టలేకపోవచ్చు. కనీసం, బాధపడడం అన్నా, ఏడవడం అన్నా చెయ్యలేరా? కానీ, అది, వాళ్ళకి బాధపడే విషయంలాగే కనపడదు. పైగా, నవ్వుకునే విషయంలాగ వుంటుంది. ఎందుకంటే తన మొగుడు, వేరే ఆడవాళ్ళని ఇష్టపడుతున్నాడేమో అన్న భయం ఉండదు. అది, ఇష్టం కాదనీ, ఊరికే వాడుకోవడమేననీ వీళ్ళకి తెలుసు. వాళ్ళకి ఎక్కడ డబ్బు ఇచ్చేస్తున్నాడేమో అన్న భయం వుండదు. వాళ్ళకి ఎక్కువ డబ్బు ఇవ్వడనీ, డబ్బు పాడు చెయ్యడనీ, వీళ్ళకి తెలుసు. ఇక దేనికి బాధ పడాలి? పైగా, ఒక ఆడది దొరికితే దాన్ని పోనివ్వడం ఎందుకు? — ఇదే రుక్మిణిలాంటి వాళ్ళ దృష్టి!

మా మేనత్త మొగుడు, కూలి ఆడవాళ్ళని తెచ్చుకుని, గదుల్లోనో, గొడ్ల పాకల్లోనో దూరుతోంటే ఆ కబురు ఎవరన్నా పరిగెత్తు కొచ్చి చెప్తే, మా మేనత్త పకపకా నవ్వేది. కోపంతోటీ, అవమానంతోటీ దహించుకు పోవలసినప్పుడు, కులాసాగా నవ్వడం నేర్చుకుందంటే, ఆ ఆడ మనిషికి పేద ఆడవాళ్ళ గురించి లక్ష్యమే లేదు. వాళ్ళని తన మొగుడు ఉపయోగించుకోవడం, 'గొప్ప వాళ్ళు చెయ్యదగ్గ పని'లాగ ఆ భార్యకి కనపడుతుంది.

ఈ రకం ఆడవాళ్ళు ఎలా తయారై వుంటారంటే, తమ మొగాళ్ళకి ఏది అనుకూలమో దాన్నే నమ్మేలాగ తయారై వుంటారు.

మొగాళ్ళెప్పుడూ పెత్తందారులే కాబట్టి, ఈ భార్యలు, వాళ్ళతో ఘర్షణలు తగ్గించుకోవాలంటే, వాళ్ళకి అనుకూలంగా నడవడంలో, ఈ 'ముండల్ని తార్చడం' కూడా ఒక పద్ధతి. మొగుళ్ళని చూసీ చూడనట్టు వొదిలెయ్యడం అంటే, దాని అర్థం అదే. ఏడవాల్సిన చోట నవ్వడం అంటే, దాని అర్థం కూడా అదే.

'క్రియూట్జెర్ సొనాటా' అనే పేరుతో టాల్‌స్టాయ్ రాసిన కథ ఒకటి ఉంది. దీనికి 'అనుమానం' అనే పేరుతోటీ, 'విషాద సంగీతం' అనే పేరుతోటీ, తెలుగు అనువాదాలు ఉన్నాయి. ఈ కథలో, ధనవంతుల కుటుంబాల్లో ఆడవాళ్ళు, అప్పుడప్పుడే ఎదుగుతోన్న తమ కొడుకులకు, వ్యభిచారిణుల దగ్గిరికి వెళ్ళమనీ, దానివల్ల ఆరోగ్యాలు బాగుంటాయనీ బోధిస్తూ వుంటారు! మొగవాళ్ళకి వ్యభిచారిణులతో తిరిగే అవకాశాలు వున్నప్పుడు, వాటిని తమ కొడుకులు ఉపయోగించుకోకపోతే, అది చాలా తెలివిమాలిన పనిలాగా కనిపిస్తుంది ఆ తల్లులికి! ఏ దేశంలో అయినా ఆడవాళ్ళ తలకాయలు, మొగవాళ్ళకే అనుకూలంగా తిరుగుతూ వుంటాయి — ఆ ఆడవాళ్ళు, తల్లులైనా, తోబుట్టువులైనా, భార్యలైనా, కూతుళ్ళయినా!

రకరకాల తప్పుడు అభిప్రాయాలతో తయారైన వాళ్ళే రుక్మిణిలాంటి ఆడవాళ్ళు! ఈ కథ రాసిన కాలంలో ఇదంతా నాకు తెలీదు.

28-3-2004